ఊరోళ్లందరి సగటు కలేమిటో తెలుసా? హాయిగా నడవడం. భుజాన బరువెంతున్నా.. కాళ్లు స్వేచ్ఛగా కదిపి హాయిగా నడవడం. అంతే! అంతకుమించి మా ఊరి వాళ్లెవరూ పెద్దగా ఏ కలా కనరు. మా ఊరు డెవలప్పైపోయిందని మా తుఫానుగాడు అన్నాడో రోజు! అందరూ కళ్లెర్రగించి ఆడివైపు చూస్తే అన్నాడూ..

''ఖానా కావాలన్నాము.. రోడ్డు వేస్తామన్నారు. ఒకప్పుడు మన ఊరి గురించి సర్పంచులే మాట్లాడేవోళ్లు. ఇప్పుడు.. ఎమ్మెల్యేలూ మాట్లాడుతున్నారు. సర్పంచుల నుంచి ఎమ్మెల్యేల స్థాయికి ఎదగడం అభివృద్ధి కాదేటి?'' అని ఎటకారంగా కళ్లెగరేసి సమాధానం ఇచ్చేడు.

నీళ్లోసుకున్న మిలంతి అందరిలాంటి కలలే కన్నాది గానీ.. కొద్దిగా.. వేరుగా!

చప్టా కట్టాల్సిన చోటునానుకునే ఆమె కన్నోరు పోడు కొండ ఉంది.

ఆ పోడు పనుల్లోనే మోహనని తొలిసారి చూసింది. అక్కడే వాడితో తొలి ముచ్చటలాడింది. ఊసులాడింది. పాటలు పాడింది, పదం కట్టింది. కంకపట్టి కొండ తువ్వింది. కందికాయల్ని గొడ్డలమ్మకు కట్టి మొక్కులు మొక్కుకుంది. అందుకే ఆ పోడు కొండంటే ముచ్చటపడింది. పోడు కిందినుంచి సాగుతున్న దారి మీద, దారి పక్కన కానుగుచెట్టు మీదా ఎక్కడ లేని మక్కువ పెంచుకుంది. ఆ దారి నడిచిన చుట్టుపక్కల ఊరివాళ్లు పలకరిస్తుంటే.. పలవరించింది. ఆ దారి దాటాల్సిన గెడ్డతో కూడా నిర్వచించలేని అనుబంధాన్ని ఏర్పర్చుకుంది.

ఆ కానుగుచెట్టు నీడన ఎన్నిసార్లు సేదతీరిందో! మిట్టమధ్యాన్నం.. కానుగు నీడన సల్దిగిన్నెలో గెంజన్నం తినడం ఆమెకున్న అపురూప దృశ్యాల్లో ఒకటి. కొండనానుకొని పారుతున్న గెడ్డకి చప్టా కడితే.. కానుగు చెట్టు నీడ దానిమీద పడతాది. ఆ నీడ కింద అంటే చప్టా గట్టు మీద కూర్చుని గెంజి మెతుకులు తినొచ్చు అనుకుంది. అప్పుడు గెడ్డ దాటుతున్నోళ్లందరూ అక్కడాగి పని చేసుకుంటున్న తనని పలకరించే దృశ్యం ఆమె కళ్లలో మెదలాడింది.

అప్పుడెప్పుడో ఓ రోజు ఆ కానుగుచెట్టుకి వేలాడుతున్న ఉట్టి దించుతున్నప్పుడు మరో కల కనింది. ఆ కొమ్మకు ఉట్టికట్టినట్టే ఉయ్యాల కట్టాలని. ఉయ్యాట్లో బిడ్డకి జోలపాడాలని.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో ద్వితీయ బహుమతి రూ.25 వేలు పొందిన కథ.

అప్పుడే.. కొండగాలి వీధుల్లోంచి.. గగన శిగల శిఖరాల మీంచి.. తేలియాడుతూ వస్తున్నదో పాట. వనగానం..!

వనమై.. పవనమై.. బృందగానమై!

గెడ్డ పక్కన ఒరకట్టిన పొలంలో పాటలు పాడుతున్నారు దిగువూరోల్లు. ఆ పాటలు కొండల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. కొండదేవతలెవరో ఈ కొండ కొసకీ, ఆ కొండ కొసకీ రాగాల తాళ్లు కట్టి, పాటల ఉయ్యాల ఊగుతున్నట్టు వినపడింది. ఆ పాటలేవో తన పూర్వీకుల జ్ఞాపకాలను మోసుకొస్తున్నట్టు.. తాత ముత్తాతల నెరవేరని ఆశలింకా సజీవంగా ఊగిసలాడుతున్నట్టు..

ఆ పాట ధ్వనిస్తున్నది... ఆ ధ్వని స్వప్నిస్తున్నది...

అదింకా మెలకువగానే ఉంది.

ఎప్పటిదో ఆ పాట! ఎన్ని తరాలు ధ్వనించిందో ఆ గానం! ఏ కలలు కని ఏ గొంతు తొలిసారి సవరించిందో! అనాదిగా వినపడుతూ.. అనంతమై.. కొనసాగుతూ!

''ఆకు పాడిందో పొద్దు.. ఆలకించిందో గెడ్డ

నడిమద్దినున్నాము వొదినే.. పనికి పరిగెట్టమ్మ వొదినే'' అని. ఈ పాట ఎన్నిసార్లు విన్నదో? ఎన్నిసార్లు దాని అర్థం ఆలోచించిందో? ఆకు పొద్దును పాడటమేటీ? గెడ్డ ఆలకించడమేటీ? నడిమద్దిన ఉన్నదెవరు? పనికి పరిగెట్టడమంటే?

గెడ్డొడ్డున.. సెలమలో నీరు తోడుతున్నపుడు తోయికి ముసిల్ది ఇలాంటివెన్నో పాడింది. పెళ్లికో? రోజుల తరబడి పాటలు పరిగెడతాయి. తను లేచిపోయి వచ్చేసింది గాబట్టి ఇవేవీ లేవు గానీ, సంప్రదాయంగా జరిగుంటే.. ఎన్ని పాటలో ఇరువైపుల నుంచి! అసలిలాంటి పాటలు ఎన్నున్నాయి? ఇవెవరు రాసేరు? ఎప్పుడు రాసేరు? ఈ పాటల ద్వారా ఏమి చెప్పాలనుకున్నారు? ఈ పాటలు ఎప్పటినుంచో పాడుతున్నామని తాత చెప్పేడు. తాతకి ముత్తాత కూడా అదే చెప్పాడట. అంటే.. ఒక తరం తర్వాతి తరంతో ఏదో మాట్లాడుతున్నది. ఏ సందేశమో అందిస్తున్నది. ఏమిటది?

తెలుసుకోవాలి. ముందు తానందుకోవాలి ఆ పాటల్ని. తర్వాత తన పిల్లలకి అందించాలి. అదిగో ఆ దారిలోనే కలకన్నది.. కొండవాలు కానుగ కొమ్మకి ఉయ్యాల కట్టాలని. ఉయ్యాట్లో తన బిడ్డకు ఆ పాటలే జోల పాడాలని.

కాలీజీ రోజుల్లో హైస్కూల్ మాష్టారు ఎదురైతే.. చేతులు జోడించింది ఓ రోజు.

'బాగున్నావా? ఏం చేస్తున్నావ్?' అని అడగకుండా..

''పాటలు పాడుతున్నావా?'' అని అడిగారు.

'ఔ' అన్నట్టు తలూపింది గానీ, లేదని తన మనసుకు తెలుసు. ఉరుకుల పరుగుల తొందర్లో ఆ పాటల్ని మర్చిపోయింది. పదో తరగతిలో ఉన్నప్పుడు తనని దగ్గరికి తీసుకుని దేశభక్తి గీతాలు రాసి పాడించేవారు మాష్టారు. బృందగానాలకి నాయకత్వం వహించేది తను. పాటని ఇట్టే పట్టేసేది. అమ్మ నేర్పిన పాటల్ని పాడి వినిపించేది.

''నీ గొంతులో అడవి పలుకుతుంది'' అనేవారు.

ఆ మాటకి అర్థం అప్పుడు తెలిసి రాలేదు. అప్పుడే మరో కల కన్నది.. ఆ పాటల మీద పరిశోధన చెయ్యాలని. బడి చదువుల కోసమే ఊరు దాటలేని తాను.. విశ్వవిద్యాలయమెలా చేరగలదు? తాను చేరలేని గమ్యమేదో తనవద్దకే వస్తే? ఆ విశ్వవిద్యాలయమేదో ఇక్కడికే.. ఈ కొండల్లోకే.. తన దరికే వస్తే? ఆగిపోని చదువులు ఎన్ని కొనసాగుతాయో! కొత్త చదువులు ఎన్నెన్ని కళ్ల చూస్తుందో కొండ!

వస్తుందా?

వస్తే.. ఇక్కడే.. ఈ పాటల మధ్యే పరిశోధన చేస్తే?

..మరో కల! నిజానికి అలాంటి కలలు ఎన్నో కన్నది. జీడి పిక్కలు తట్టలు తట్టలు తలమీద ఉంచి కొండ మీంచి కిందికి దించుతుంటే.. బరువు మొయ్యానవసరం లేకుండా.. మధ్యవర్తులు లేకుండా.. మార్కెట్ ఇక్కడికే తన వద్దకే వస్తే?

తను ఒలిచిన చింతబొట్టలు మోసం లేకుండా ఇక్కడే నేరుగా అమ్ముకోగలిగితే..?

ఏ జబ్బొచ్చినా టక్కున మాత్ర అందించగల ఆసుపత్రి ఇక్కడే ఉంటే?

తమవాళ్లు సేకరించిన ఇప్ప మొగ్గలకి అమెజాన్, ఫ్లిప్‌కార్టుల్లో మంచి గిరాకీ ఉండగల రోజులొస్తే?

కలల బరువుకి కనులు అలిసిపోయాయేమో!